సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.27 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి. మార్కెట్‌కు 481 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.5.50 మేర పలికింది.



జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.



న్యూస్‌రీల్

తిమ్మమాంబ సేవలో జిల్లా సెషన్స్ జడ్జి



ప్రత్యేక పూజలో పాల్గొన్న జడ్జి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

ఎన్‌పీకుంట: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మమర్రిమానును శుక్రవారం అనంతపురం జిల్లా సెషన్స్ జడ్జి నాగేశ్వరరావు, కుటుంబీకులతో కలిసి సందర్శించారు. అనంతరం తిమ్మమాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్రిమాను విశిష్టతను, ఆలయ చరిత్రను టూరిజం గైడ్ మనోహర్, అనిల్‌రాయల్ ద్వారా తెలుసుకున్నారు. అంతకుముందు తిమ్మమాంబ ఆలయ అర్చకులు, గైడ్‌లు జడ్జి కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి సత్కరించారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ



మల్లిరెడ్డికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ లక్ష్మి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జిల్లాలో శుక్రవారం ముగిసింది. 5 రోజులుగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ మొత్తం అందజేశారు. జిల్లాలో 2,64,128 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.73,33,11,000 విడుదల చేసింది. గ్రామ, వార్డు వలంటీర్లు 2,61,160 మంది లబ్ధిదారులకు పింఛన్ రూపంలో రూ.72,50,23,500 అందజేశారు. ఫలితంగా జిల్లాలో 99శాతం పంపిణీ జరిగినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పుట్టపర్తి మండలం గువ్వలగుట్టపల్లికి చెందిన మల్లిరెడ్డి అనంతపురంలో చికిత్స పొందుతుండగా, విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ లక్ష్మి... అక్కడికే వెళ్లి పింఛన్ మొత్తం అందజేసింది. దీంతో మల్లిరెడ్డి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

కనగానపల్లి: మండల పరిధిలోని దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురంలోని విద్యుత్ నగర్‌కు చెందిన మంజునాథ్‌రెడ్డి (26) బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వారంతంలో వరుసగా సెలవులో రావటంతో శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బెంగళూరు నుంచి అనంతపురం బయలుదేరాడు. దాదులూరు వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఓవరు టేక్ చేయబోయి అదుపు తప్పి లారీ చక్రాల కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మంజునాథ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమానికి సకలం మద్దతు

'జగన్ బాబు చల్లగా ఉండాలయ్యా...ఏ ఆధారం లేని నాకు నెలానెలా పింఛన్ ఇస్తున్నాడు. వలంటీర్ 1వ తేదీనే ఇంటికే వచ్చి డబ్బులిస్తున్నాడు. మాకు కొడుకులా ఇంత చేస్తున్న ముఖ్యమంత్రి రుణం ఏమిచ్చినా తీర్చుకోలేం'

– ఓ వృద్ధురాలి ఆత్మీయ ప్రశంస

'విత్తనం వేసింది మొదలు..పంట విక్రయించే దాకా రాష్ట్ర ప్రభుత్వం మాకు తోడుగా నిలుస్తోంది. పంట పండితే గిట్టుబాటు ధర కల్పిస్తోంది. విపత్తుల్లో పంట నష్టపోతే పరిహారం ఇచ్చి ఆదుకుంటోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా సకలం అందుతున్నాయి. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు'

– ఓ రైతు మెచ్చుకోలు

'డబ్బులేక బిడ్డను చదివించలేనేమోనని భయంగా ఉండేది. సీఎం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనతో ఆదుకున్నారు. నా చిన్న బిడ్డకు 'అమ్మ ఒడి' అందించారు. మాలాంటి మధ్య తరగతి కుటుంబాల్లోని పిల్లల భవిష్యత్‌కు మేనమామలా ఆదుకుంటున్నారు. నిజంగా సీఎంగా మా అన్నే ఉన్నాడనిపిస్తోంది.

– సీఎంపై ఓ మహిళ నమ్మకమిది

...ఒకరు కాదు..ఇద్దరు కాదు..అందరిదీ దాదాపు ఇదే అభిప్రాయం. 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ప్రజాప్రతినిధులు ఎక్కడికి వెళ్లినా...ఎవరిని పలకరించినా... జగనన్న సంక్షేమ పాలన గురించి సంతోషంతో చెబుతున్నారు. ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలు అర్హుల చెంతకే చేరాయని సంతృప్తి వ్యక్తం చేశారు.



నల్లమాడ: రెడ్డిపల్లిలో 'జగనన్నే మా భవిష్యత్' కిట్‌ను అందజేసి వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట



సోమందేపల్లి: 'జగనన్నే మా భవిష్యత్' స్టిక్కర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

- అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం
- ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు వివరించిన ప్రజాప్రతినిధులు
- జగన్ నాలుగేళ్ల పాలనపై జనం సంతృప్తి

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కలిగి ఉంటే మరోమారు ఆశీర్వదించాలని కోరేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైంది. పార్టీ ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. 'జగనన్న వచ్చిన తర్వాత ప్రజలను ఏ విధంగా కాపాడుకుంటూ వచ్చారు... సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తున్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించేందుకు ఏ విధంగా పరిశ్రమలు తీసుకొస్తున్నారు. రాష్ట్రానికి ఆదాయ వనరులు ఏ విధంగా పెంపొందిస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల తాలూకా వడ్డీలు ఏ విధంగా చెల్లిస్తున్నారు' అనే అంశాలతో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈనెల 20వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగనుంది.

14 రోజుల్లో 6 లక్షల గడపలకు

జిల్లాలోని 32 మండలాల పరిధిలో 544 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 6,09,316 గడపలు ఉన్నాయి. ఈనెల 20వ తేదీ వరకు (14 రోజులు) అన్ని గడపలు తిరిగేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రతి ఇంటికీ వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లి గత 46 నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకుని ఐదు ప్రశ్నలకు సమాధానాలను సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభమైంది.

తొలిరోజు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్న వివరాలు

- నల్లమాడ మండలం రెడ్డిపల్లిలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. వారి అనుమతి మేరకు ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు.
- సోమందేపల్లిలో పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పర్యటించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ జనం సంతోషం వ్యక్తం చేశారు.
- హిందూపురం మండలం చలివెందల గ్రామంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పర్యటించారు. మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు.
- మడకశిర పట్టణం 5వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ జగన్ నాలుగేళ్ల పాలనపై సంతోషం వెలిబుచ్చారు. వారే తమ ఇళ్ల గోడపై 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించుకున్నారు.
- ధర్మవరం పట్టణంలోని 7వ వార్డులో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పథకాల అమలు, వైఎస్సార్ సీపీ పాలన గురించి తెలుసుకున్నారు.
- కదిరి 8వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పర్యటించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో ముచ్చటించారు. అందరూ జగన్ పాలనకు జై కొట్టగా..ఇంటి గోడల మీద స్టిక్కర్లు అంతికించారు.



అనంతపురం రూరల్:మండలం పాపంపేటలో 'జగనన్నే మా భవిష్యత్తు'లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మడకశిర: మున్సిపాలిటీలోని చీపులేటిలో ఓ ఇంటి గోడపై స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



కదిరి: 8వ వార్డులో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్ధారెడ్డి



ధర్మవరం: ఓ లబ్ధిదారుడి ఇంట్లో 'జగనన్నే మా భవిష్యత్' స్టిక్కర్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



హిందూపురం: 'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టరు, కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

రైతు పంట పండింది



లోచర్ల వద్ద వేరుశనగ కాయలను బస్తాల్లో నింపిన వ్యాపారులు



బ్రాహ్మణపల్లి వద్ద మొక్కజొన్నను బస్తాల్లో నింపుతున్న కూలీలు

- రబీలో పెరిగిన దిగుబడులు
- గిట్టుబాటు ధరలతో రైతు ఇంట ఆనందం

పుట్టపర్తి అర్బన్: రబీలో రైతన్న పంట పడింది. ఈసారి విస్తారంగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటల్లో నీరు చేరింది. భూగర్భ జలమట్టం కూడా పెరగడంతో సాగునీటికి ఇబ్బందులు లేకుండా పోయింది. దీంతో రబీ సీజన్‌లో రైతులు బోరు బావుల కింద ఉత్సాహంగా పంటల సాగు చేపట్టారు. రబీ సీజన్‌లో ప్రధాన పంట వేరుశనగ ఎప్పుడూ 15 వేల హెక్టార్లకు మంచి సాగయ్యేది కాదు. ఈసారి సాగునీటి ఇబ్బందులు లేకపోవడం, యంత్రాలు అందుబాటులో ఉండటంతో రైతులు బోర్ల కింద భారీగా సాగుచేశారు. దీంతో వేరుశనగ విస్తీర్ణం ఈసారి 20,550 హెక్టార్లు దాటింది. ప్రస్తుతం పంట తొలగింపు సాగుతోంది. ఎకరా వేరుశనగకు రూ.20 వేలు దాకా ఖర్చు కాగా, 15 నుంచి 20 బస్తాలు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వేరుశనగ (కే–6 రకం) 42 కిలోల బస్తా రూ.3,100 ఉండగా, కదిరి లేపాక్షి రకం రూ.2,500 వరకూ పలుకుతోంది. దీంతో ఖర్చులు పోను ఆదాయం రావడంతో రైతులు ఆనంద పడుతున్నారు.

రికార్డు స్థాయిలో మొక్కజొన్న

ఇక ఏటా రబీ సీజన్‌లో మొక్కజొన్న 3 వేల హెక్టార్లకు మించి సాగయ్యేది కాదు. కానీ ఈసారి నీటి వసతి ఉండటంతో రైతులు పంటసాగుకు ముందుకు వచ్చారు. ఫలితంగా 6,125 హెక్టార్లలో పంట సాగైంది. ఎకరాకు రూ.10 వేల ఖర్చు కాగా, 20 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.2 వేలకుపైగా ధర పలుకుతోంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు పుష్కలంగా ఉండటం, యంత్రాలతో కూలీల కొరత తీరడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుండటంతో మూడేళ్ల నుంచి రబీలో లాభాలు చూస్తున్నామని రైతులు చెబుతున్నారు.

దేవుడా.. ఇదెక్కడి ఘోరమయ్యా

ఇంటి యజమాని చెప్పిన పని చేసుకుని త్వరగా వస్తానన్న భర్త ఎంతకూ తిరిగి రాలేదు. ఫోన్ చేస్తుంటే రెండు గంటలైనా ఎత్తలేదు. తర్వాత కొద్దిసేపటికి యజమాని కొడుకు ఆందోళనగా రాగా, 'నా భర్త ఏమయ్యాడు సార్.. ఎక్కడున్నాడు?' అని అడిగింది. పేలుడు ఘటనలో చనిపోయాడని చెప్పగానే.. ఇంటి యజమాని కాళ్లు పట్టుకుని 'నా భర్తను తెచ్చివ్వండి' అంటూ బోరున విలపించింది. కడసారి చూసేందుకూ అవకాశం లేకుండా శరీరం ఛిద్రమై ముక్కలు ముక్కలయ్యిందని తెలిసి గుండెలవిసేలా రోదించింది. దేవుడా.. ఇదెక్కడి ఘోరమయ్యా అంటూ కన్నీటి పర్యంతమైంది. అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ హృదయ విదారకర ఘటన జరిగింది.



పేలుడు సంభవించిన ప్రాంతంలో పడివున్న కెమికల్ డ్రమ్ము

- కెమికల్‌తో భారీ విస్ఫోటం
- గాల్లోకి ఎగిరి ఛిద్రమైన యువకుడి శరీరం
- సంఘటన స్థలంలో స్పృహ కోల్పోయిన భార్య
- తన భర్తను తెచ్చివ్వాలంటూ రోదించిన వైనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన చాకలి సతీష్ (34), నవ్య దంపతులు అనంతపురం హౌసింగ్‌బోర్డులోని కేకే పెయింట్స్ యజమాని ఇస్మాయిల్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్, ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు లక్ష్మీకుమార్, మహేష్ ఉన్నారు. ఆర్టీఏ కార్యాలయ సమీపంలో గల పెయింట్స్ తయారీ పరిశ్రమను ఇస్మాయిల్ పదేళ్ల క్రితమే మూసేశారు. అయితే అందులో కెమికల్స్ డ్రమ్ములు అలాగే ఉన్నాయి. ముందు భాగంలో డ్రెస్సింగ్ టేబుళ్లు తయారు చేసే పరిశ్రమ నడుపుతున్నారు. మూసేసిన పెయింట్ పరిశ్రమ షెడ్లను అద్దెకు తీసుకునేందుకు నాలుగు రోజుల క్రితం ఎవరో వచ్చారు. వారి కోసం షెడ్లను శుభ్రం చేయించి.. కెమికల్ డ్రమ్ములను ఇస్మాయిల్ బయట పెట్టించారు. కెమికల్‌ను కాలువలోకి పారబోసి.. డబ్బాలను గుజిరీకి వేసుకుని డబ్బు నువ్వే తీసుకో అని చాకలి సతీష్‌కు చెప్పాడు. ఎంతో కొంత డబ్బు వస్తుందన్న ఆశతో సతీష్ శుక్రవారం మధ్యాహ్నం షెడ్డు వద్దకు వచ్చి ఒక డ్రమ్ము మూత తీస్తుండగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. సతీష్ గాల్లోకి ఎగిరి శరీరం ఛిద్రమైంది. ముక్కలు ముక్కలుగా మాంసపు ముద్దలు చెల్లాచెదురుగా ఆ ప్రాంతమంతా పడటంతో భయానక వాతావరణం నెలకొంది. పేలుడు సమయంలో అదే ఆవరణలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు యువకులు వుడ్‌వర్క్ చేస్తున్నారు. వారిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. త్వరగా వస్తానని చెప్పి వెళ్లిన భర్త ఎంతకూ రాకపోవడంతో భార్య నవ్య ఫోన్ చేసింది. అయితే భర్త ఫోన్ తీయలేదు. రెండు గంటల తర్వాత ఇంటి యజమాని కుమారుడు ఆందోళనగా రాగా, 'ఏమైంది సార్?' అని అడిగిన నవ్యకు జరిగిన విషయం చెప్పాడు. కడసారి చూపు చూద్దామని వెళ్తే.. భర్త శరీరం తునాతునకలైపోయి ఉండటం చూసి స్పృహ తప్పి పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత కోలుకుని గుండెలు బాదుకుంటూ విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. చివరకు పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి ఓదార్చాల్సి వచ్చింది.

నెత్తురోడిన నోట్లనూ వదల్లేదు!

ఇళ్లల్లో పాచిపని చేసి భార్య (నవ్య), వాచ్‌మెన్‌గా, నాలుగిళ్లల్లో బట్టలు ఉతికి ఇస్త్రీ చేసి భర్త (సతీష్) రూ.30వేల దాకా పోగేశారు. ఈ మొత్తాన్ని సతీష్ జేబులో పెట్టుకుని డ్రమ్ములు గుజిరీకి వేసి వద్దామని వెళ్లాడు. ఊహించని విధంగా కెమికల్ విస్ఫోటనంలో మృతి చెందగా.. నెత్తురోడిన నోట్లు చెల్లాచెదురుగా పడ్డాయి. అటువైపు వచ్చిన కొందరు వాటిని తీసుకెళ్లిపోయారు. మానవత్వం మరచిన మనుషులను చూసి ఓ వృద్ధురాలు 'ఏం బతుకులురా మీవి' అంటూ నిట్టూర్చారు.

ఆధారాల కోసం అన్వేషణ

పేలుడు సమాచారం అందగానే వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్, డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. పేలుడుకు సరైన కారణాలు తెలియరాలేదని, ఘటనా స్థలిలోని నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపుతామని వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా హానికరమైన కెమికల్స్‌ను నిల్వ ఉంచిన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తున్నామన్నారు. మృతుడు సతీష్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చాలా ఏళ్లుగా కెమికల్స్‌ను వాడకుండా వదిలేసినందువల్ల రియాక్షన్ జరిగి పేలుడు సంభవించి ఉండొచ్చని లేదా మూత తీసే సమయంలో ఎవరైనా బీడీ, సిగరెట్ తాగుతున్నా కెమికల్ గ్యాస్ రిలీజ్ అయ్యి పేలే అవకాశం చాలావరకు ఉందని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



రోదిస్తున్న సతీష్ భార్య నవ్య



ఆధారాల కోసం డాగ్‌స్క్వాడ్‌తో అన్వేషణ



పుట్టపర్తి : షాలోమ్ మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



- జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో గుడ్ ఫ్రై డే ప్రార్థనలు

సిలువధారీ.. నీ శరణు కోరి

పుట్టపర్తి టౌన్: సర్వమానవుల పాప పరిహారార్థం సిలువనెక్కిన ఏసు త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో శుభ శుక్రవారం ప్రార్థనలు జరిగాయి. ఆయా చర్చిల ఆవరణల్లో సిలువ ఘట్టాలను ప్రదర్శించారు. హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, ధర్మవరం తదితర పట్టణాల్లోని చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో సిలువపై ఏసు పలికిన 7 మాటలను ధ్యానించారు. క్రీస్తు అనగానే క్షమ, కరుణ, ప్రేమ గుణాలు గుర్తుకు వస్తాయని, ఆ కరుణామయుడి బాటలో అందరూ నడుస్తూ ఇతరులకు ప్రేమ పంచాలన్నారు. కర్ణాటక నాగేపల్లి గ్రామంలో, హోలీసిటీ చర్చి, కింగ్స్ చర్చిలో పాస్టర్ అరుణ్‌కుమార్, బీడుపల్లి, ప్రశాంతి గ్రాంలో ఉన్న షాలోమిషన్ చర్చిలో పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో ఉదయం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని జంగాలపల్లి, చిగిచెర్ల రైల్వేస్టేషన్ మధ్య శుక్రవారం ఉదయం ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని కనుగొన్నట్లు రైల్వే ఎస్ఐ గోపీకుమార్ తెలిపారు. సుమారు 35–45 సంవత్సరాల వయసు గల వ్యక్తి ఏదో రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లుగా తెలుస్తోందన్నారు. మృతుడు నీలం రంగు నైట్ ప్యాంట్, లేత నీలి రంగు షర్ట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే రైల్వే ఎస్ఐ గోపీకుమార్ సెల్ నంబర్: 9440627640కు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


మృతులు శ్రీనివాసులరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నల్లచెరువు/తనకల్లు: నల్లచెరువు మండలం ఎర్రగుంటపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులరెడ్డి (43), చంద్రశేఖర్‌రెడ్డి (42) అనే ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. పోలీసుల వివరాలమేరకు.. తనకల్లు మండలం కనసానివారిపల్లికి చెందిన శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ గుడికి పెయింట్స్ తీసుకురావడానికి ద్విచక్ర వాహనంలో కదిరికి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే ఎర్రగుంటపల్లి చెరువు మలుపు వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొంది. అనంతరం కదిరి వైపు నుంచి వస్తున్న కారును కూడా బొలెరో ఢీ కొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా, బొలెరో వాహనం చెరువులోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లో వస్తున్న శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ షేక్షావలి తెలిపారు.

వలస బతుకులు

- ఏటా యూపీ నుంచి ఏపీ బాట
- ఇనుప పనిముట్ల తయారీతోనే జీవనం
- పిల్లాపాపలతో రోడ్ల పక్కనే నివాసం
- అక్కడ పనులు దొరక్కనే వస్తున్నామంటున్న ఉత్తరప్రదేశ్ వాసులు


పనిముట్ల తయారీలో నిమగ్నమైన ఉత్తరప్రదేశ్ వాసులు

హిందూపురం: రెక్కడితేగాని డొక్కడని బతుకులు వారివి. తల్లి బిడ్డలతో సహా పనిచేస్తేనే నాలుగు ముద్దలు దొరికేది. ఉన్న ఊర్లో పనులు దొరక్క వందల కిలోమీటర్లు దాటి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి రోడ్డు పక్కన మండుటెండల్లో చేమటోర్చి ఇనుప వస్తువులు తయారు చేసి బతుకీడుతున్నారు.

స్థానికంగా దొరికే ఇనుప వస్తువులతో...

హైటెక్ యుగంలోనూ ఎంతో మంది వారి వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో పనులు దొరక్క, చేసిన పనిముట్లు అమ్ముడు పోకా బతుకు జీవుడా అంటూ ఎంతో మంది హిందూపురం వలస వచ్చారు. ఇనుము వంచి పనిముట్లు తయారు చేసి వాటిని విక్రయిస్తూ వచ్చిన కాస్త సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. ఏడాదిలో ఆరునెలల పాటు తమ బిడ్డలతో సహా వలస వస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఊరూరా తిరిగి ఇనుప కడ్డీలు, వాహనాల షాకాబ్ కామన్ ప్లేట్లను నిప్పుల్లో కాల్చి వ్యవసాయ, ఇంటి పనిముట్లు తయారు చేస్తుంటారు. వలస వచ్చేటప్పుడు తయారీ పరికరాలను మాత్రమే తేస్తారు. స్థానికంగా దొరికే ఇనుప వస్తువులను పనిముట్లు అందమైన ఆకృతులతో తయారు చేసి విక్రయిస్తారు. కొడవళ్లు, గొడ్డళ్లు, కత్తులు, పారలు, గుణపాలు, కత్తిపీటలు తదితరాలు సిద్ధంచేసి తయారు చేసే చోటే ప్రదర్శనగా ఉంచి అమ్ముతారు. మరికొందరు ఊర్లో వీధుల్లో తిరిగి విక్రయాలు చేయిస్తారు. రూ.150 నుంచి రూ.500 రేటుతో అమ్ముతుంటారు. ఇలా ఉత్తరప్రదేశ్ నుంచి ఒక్కో ఊర్లో పదుల సంఖ్యలో వివిధ ప్రధాన రహదారుల పక్క టెంట్లు వేసుకుని రోజుల తరబడి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.


అమ్మకానికి ఉంచిన కత్తులు, కొడవళ్లు, ఇతర పనిముట్లు

తెల్లవారితే పనుల్లోకి...

యూపీని వచ్చిన వారంతా తెల్లవారంగానే తమ పనుల్లో నిమగ్నమైపోతారు. ఉదయం నుంచి చీకటి పడే వరకు తయారీలు, విక్రయాలు సాగుతుంటాయి. ఆడ, మగ, పిల్లలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పనులు చేస్తుంటారు. బొగ్గులతో పొయ్యిలపై వస్తువులను తయారు చేస్తూనే దానిపైనే రొట్టెలు కాల్చుకుని తింటారు. రాత్రి పడంగానే అన్నీ సర్దుకుని గుడి వద్దనో, ఖాళీ ప్రదేశాల్లోనో గుడారల్లో తలదాచుకుంటుంటారు.

ఈ పనొక్కటే తెలుసు



నాకు చిన్నప్పటి నుంచి ఇనుము పని మాత్రమే తెలుసు. ఊరురా తిరిగి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాం. ఎవరూ పెద్దగా చదువుకోనే అవకాశం ఉండదు. సొంతుర్లో ఉన్నప్పుడే కాస్తాంతా చదువు ఉంటుంది అంతే. మా వస్తువులకు కూడా గిరాకీ తక్కువగా ఉంటోంది. ఏటా వలస వచ్చి పనిచేసినా తినడానికి పోను పెద్దగా మిగలదు.

–బిరూపాల్ , ఉత్తరప్రదేశ్

ఊర్లో పనులు లేకనే..



ఉత్తరప్రదేశ్‌లో పనులు లేకనే ఇలా వలస వచ్చి బతుకుతున్నాం. అక్కడ ఉపాధి పథకం ఉన్నా సరిగా కూలీలు ఇవ్వరు. ఇక్కడే చాలా మేలు. కూలీలకు పనులు దొరుకుతాయి వలసలు కనిపించవు. అంతకన్న ప్రభుత్వాలు పేదలను ఆదుకుంటాయి. మేం తయారు చేసే పనిముట్లకు ఏపీలో చాలా ఆదరణ ఉంటోంది. అందుకే ఇక్కడకు వస్తుంటాం.

– వీరు, ఉత్తరప్రదేశ్

చిన్నతనం నుంచి ఇదే పని



చిన్నతనం నుంచి మా తల్లిదండ్రులు ఇనుము పని మాత్రమే నేర్పారు. అందుకే పని చేస్తూనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మా ఊళ్లో పనులు లేకనే ఇలా వలసలు రావాల్సిన దుస్థితి నెలకొంది. జీవనోపాధి కోసం కుటుంబంతో సహా వలస వచ్చేస్తాం. ఆరునెలలు ఇలా పనులు చూసుకుని వెళ్తాం.

– భగవాన్, ఉత్తరప్రదేశ్.

ఆముదం ఆకులు తిని 20 గొర్రెల మృతి

కణేకల్లు: మండలంలోని ఆదిగానిపల్లిలో శుక్రవారం ఆముదం ఆకులు తిని 20 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల వివరాలమేరకు.. గొర్రెల కాపరులైన జడప్పగారి బసవరాజు, హరిజన దుగ్గెన్నలు తమ గొర్రెలను తీసుకొని మేత కోసం పొలాలకెళ్లారు. అయితే గొర్రెలు ఆముదం తోటలో వెళ్లి వాటి ఆకులను తిన్నాయి. దీంతో సాయంత్రం ఒక్కసారిగా గొర్రెల కడుపులు ఉబ్బరమై స్పృహ కోల్పోయి పడిపోయాయి. ఆ తర్వాత మృతి చెందాయి. జడప్పగారి బసవరాజుకు చెందిన 11 గొర్రెలు, దుగ్గెన్నకు చెందిన 9 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఒక్కోదాని విలువ రూ.10 వేలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని వెటర్నరీ డాక్టర్ నాగబాబుకు చెప్పడంతో ఆయన సిబ్బందిని ఘటన స్థలానికి పంపారు. మృతి చెందిన గొర్రెలకు శనివారం ఉదయం పోస్టుమార్టం చేయనున్నట్లు డాక్టర్ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం


సమీరా (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నందలపాడుకు చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు పట్టణ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. ఎస్ఐ వివరాలమేరకు.. నందలపాడుకు చెందిన సమీరా (14) ప్రగతి కాన్సెప్ట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తల్లి షాకీరాబాను నిద్రలేచి చూడగా కనిపించకపోవడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చౌడేశ్వరీదేవికి ఉయ్యాలసేవ


అమ్మవారికి జ్యోతుల బోనాలను సమర్పిస్తున్న మహిళలు


ఉయ్యాలసేవలో దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి

అమడగూరు: చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని శీతిరెడ్డిపల్లి గ్రామస్తులు అమ్మవారికి ఉయ్యాల సేవను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే గ్రామ పెద్దలు, యువకులు ఆలయం నుంచి అమ్మవారిని ముత్యాల పల్లకీలో ఊరేగింపుగా డప్పు వాయిద్యాల నడుమ గ్రామానికి తీసుకొచ్చారు. మహిళలంతా అమ్మవారికి జ్యోతులు, బోనాలను సమర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని కొలువుదీర్చి మహిళలంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శనివారం సూర్యప్రభ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం కాకి, అప్పేపల్లి, ఆర్.రంగాపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు నియమ నిష్టలతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా జ్యోతులను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం ఉదయమే అమ్మవారి మూలవిగ్రహంతో పాటు ఉత్సవ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో పాటు పూలు, గంధంతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. అమ్మవారిని ఇంటి ఇలవేల్పుగా కొలిచే చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో భక్తులు ఉత్సవానికి హాజరై అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు.


జ్యోతులతో ఆలయం చుట్టూ ఊరేగింపు చేస్తున్న భక్తులు

పాలబావిలో గంగ పూజ

రొళ్ల మండలం రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయ సమీపంలో ఉన్న పాలబావి దగ్గర గంగ పూజ చేశారు. ఈ క్రమంలో పెళ్లికాని యువతులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు పాలబావిలో గంగ పూజను చేస్తే ఇష్టకార్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. మహిళలు బావిలోకి గాజులు, పండ్లు, పూలు, హారతులు ఇతరాత్ర వాటిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.


పాలబావి దగ్గర గంగ పూజ చేస్తున్న మహిళలు

నేడు ఎస్సీ కాలనీ వారిచే ..

రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వారిచే అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం


సిబ్బందికి సూచనలిస్తున్న రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు సంచాలకులు కామేశ్వరప్రసాద్

ముదిగుబ్బ: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు సంచాలకులు డాక్టర్ కామేశ్వర ప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ముదిగుబ్బ మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలోని ఐసీటీసీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రతి హెచ్‌ఐవీ బాధితుడికి హెపటైటిస్ బి సూది మందు మూడు డోసులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రాజేంద్ర, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ బషీర్ బాషా, షేర్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, నాగార్జున పాల్గొన్నారు.

రియల్ వ్యాపారంలో విభేదాలు.. వ్యక్తిపై దాడి


దాడిలో గాయపడిన సంజీవులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చిన విభేదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై నలుగురు దాడి చేసిన ఘటన శుక్రవారం స్థానిక కమలానగర్‌లోని ఆర్‌కే రెస్టారెంట్‌లో చోటు చేసుకుంది. ఈ ఘటనపై బాధితుడు సంజీవులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు సంజీవులు వివరాలమేరకు... గుత్తి పట్టణానికి చెందిన రాణా అనే వ్యక్తికి సంబంధించిన భూమిని గార్లదిన్నె మండలం ముకుందాపురానికి చెందిన సంజీవులు అమ్మించాడు. కాగా భూమి డబుల్ రిజిస్ట్రేషన్ అయింది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న సంజీవులు.... రాణాతో ఫోన్‌లో విషయం అడిగాడు. ఇలా చేయడం సరైంది కాదని హెచ్చరించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఫోన్‌లోనే వాదోపవాదాలు జరిగాయి. కాగా రాణా ఫోన్ చేసి నీతో మాట్లాడాలి... కమలానగరులోని ఆర్‌కే హోటల్ వద్దకు రమ్మని కబురుపెట్టాడు. సంజీవులు రెస్టారెంట్‌కు వెళ్లి మాట్లాడుతుండగా ఇరువురి మధ్య మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో రాణా మగ్గ తీసుకుని సంజీవులుపై దాడి చేయడంతో తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు సంజీవులును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా చికిత్స అనంతరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన సంజీవులు తనపై దాడి చేసిన వారిపైన ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రామాంజి (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన చిన్నంపల్లి రామాంజి (35) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. రామాంజి తన భార్య మంజమ్మ పిల్లలతో కలిసి జలజీవన్ మిషన్ కింద పైపులైన్ పనులు చేయడానికి కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లా కార్‌కల్‌కు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసిన తరువాత చిన్నారులు కోరడంతో బిస్కెట్లు తీసుకురావడానికి దుకాణానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. స్థానికులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు అందిస్తుండగా రామాంజి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహంపై పడి రోదించడం స్థానికులను కూడా కంట తడి పెట్టించింది. కర్ణాటక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్లోకాలు పఠిస్తున్న బాలవికాస్ చిన్నారులు


చిన్నారుల నృత్యప్రదర్శన

భక్తిశ్రద్ధలతో పర్తియాత్ర

ప్రశాంతి నిలయం: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సత్యసాయి భక్తుల పర్తియాత్రతో ప్రశాంతి నిలయంలో సందడి నెలకొంది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత జార్ఖండ్ వాసులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి పూర్వ విద్యార్థులు, బాలవికాస్ చిన్నారులతో కలసి శ్లోకాలను పఠించారు. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత జార్ఖండ్‌లోని సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. సర్వదేవతను కొనియాడుతూ చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. తర్వాత పర్తియాత్రకు తరలివచ్చిన 600 మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.